ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి
బుధవారం | 29 | మే | 2024
పేజీలు 4

# కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు



**ప్రజాపక్షం/ఖానాపూర్ రూరల్:** ఖానాపూర్ మండలంలోని పాత ఎల్లాపూర్ గ్రామంలో నిర్మల్ జిల్లా కలెక్టర్ అదేశానుసరం వరి ధాన్యం కోనుగోలు యకేంద్రాలని ఖానాపూర్ ఎమ్మార్వో శివరాజ్ పరిశీలించారు.కొనుగోలు కేంద్రంలో వడ్లు బాగా ఉన్నాయని అకాల వర్షాలు వస్తునందువలన వరి కొనుగోలు వేగవంతం చేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని అన్నారు.రైతులు కూడా కొనుగోలు కేంద్రంలో వారితో సహకరించాలని తొందరగానే ఇక్కడ ఉన్న వడ్లు కొనుగోలు చేస్తామని తెలిపారు.తూకం వేసిన వరి ధాన్యం బస్తాలను ప్రస్తుతం ఇక్కడ ఉన్న రెండు లారీలలో నింపి రైస్‌మిల్ కు పంపడం జరుగుతుంది అని ఇంకొక్క లారీ ఇక్కడే అందుబాటులో ఉంటుందని అన్నారు.వర్షం పడితే సరైన టార్పలిస్ కవర్ల రైతులకు అందుబాటులో ఉంచాలని వరి కొనుగోలు చేసే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం వారికి సూచించారు.

# ఓట్ల కౌంటింగ్‌కు సన్నద్ధం

## జూన్ 4న అప్రమత్తంగా ఉండాలి.. టెన్షన్ పడొద్దు

### కలెక్టర్,పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్



**ప్రజాపక్షం/పెద్దపల్లిరూరల్:**పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ నిబంధనల ప్రకారం ప్రశాంతంగా నిర్వహించేందుకు అధికారులు సన్నద్ధం కావాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ రామగిరిలోని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణపై సంబంధిత కౌంటింగ్ అధికారులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు జే.అరుణ శ్రీ, జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్ లతో కలిసి పాల్గొన్నారు. కలెక్టర్, పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ, జూన్ 4న ఉదయం 8 గంటలకు జేఎన్టీయు కళాశాల నందు పెద్దపల్లి పార్లమెంట్ పరిధిలోని పెద్దపల్లి, మంథని, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ లకు సంబంధించిన కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమవుతుందని, ముందస్తుగా పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ఉంటుందని అన్నారు. కౌంటింగ్ నిర్వహించే సమయంలో అధికారులు, సిబ్బంది నిబంధనలను గుర్తుంచుకోవాలని, ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటించాలని, కౌంటింగ్ హాల్లో అధికారులు, సిబ్బంది మౌనంగా ఉండాలని, ఎటువంటి సందర్భం ఎదురైనప్పటికీ ప్రశాంతంగా లెక్కింపు ప్రక్రియ పకడ్బందీగా నమోదయ్యేలా చూసుకోవాలని, గందరగోళానికి గురి కావద్దని అన్నారు. కౌంటింగ్ కేంద్రంలోకి ఎవరికి సెల్ ఫోన్ అనుమతి లేదని, కౌంటింగ్ కేంద్రం వద్ద అవసరమైన తనిఖీ నిర్వహించేలా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రానికి ప్రతి ఒక్కరూ తప్పని సరిగా గుర్తింపు కార్డు తీసుకుని రావాలని, కౌంటింగ్ ఏజెంట్లతో ఎటువంటిసంభాషణలు పెట్టుకోవద్దని, ప్రశాంతంగా వ్యవహరించా లని అన్నారు. స్ట్రాంగ్ రూమ్ నుంచి కౌంటింగ్ హాల్ కు ముందస్తుగా కంట్రోల్ యూనిట్ లను హమాలీలు తీసుకుని వస్తారని, ప్రతి 2 ఒక హమాలీ ఉంటారని, వారికి డ్రెస్ కోడ్ ఉంటుందని, ప్రతి టేపతి వద్ద వారికి కేటాయించిన కంట్రోల్ యూనిట్లు మాత్రమే చెక్ చేసి కౌంటింగ్ చేయాలన్నారు. ప్రతి టేపతి వద్ద కౌంటింగ్ సూపర్వైజర్, కౌంటింగ్ అసిస్టెంట్, మైక్రో అబ్జర్వర్ ఒక బృందంగా విధులు నిర్వహిస్తారని, బృందాలు అందుబాటులో ఉంటాయని అన్నారు.

# చికిత్స సమయంలో వైద్యులను ఇబ్బంది పెట్టొద్దు



**ప్రజాపక్షం/బైంసా:** ఈ నెల 25న బైంసా ఏరియా హాస్పిటల్ లో జరిగిన సంఘటనలో యూట్యూబర్ అత్యుత్సాహం ప్రదర్శించడం జరిగిందని బైంసా ఏరియా ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ కాశీనాథ్ అన్నారు. ఏరియా ఆసుపత్రిలో వైద్యులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు.గర్భవతి ట్రీట్మెంట్ కు వచ్చిన సమయంలో సదరు విలేఖరి లేబర్ వార్డులో రావడం ఏంటి అని ప్రశ్నించారు.నిబంధనల ప్రకారం అక్కడ మగవాళ్ళు ఎవరు రాకూడదని నిబంధనలు ఉన్నప్పటికి డెలివరీ వార్డులోకి వచ్చి వైద్యురాలిని బెదిరించడం పద్ధతి కాదన్నారు.ఆరోజు చికిత్స కోసం వచ్చిన గర్భిణీకి ముందే కడుపులో పనిబిడ్డ మృతి చెందిందని,ఐదు నెలల గర్భిణీ అని తెలియజేశారు. రకహీనత హైబీపీ ఉండడం మూలంగా హైరిస్క్ కి ప్రెగ్నెన్సీగా పరిగణలోకి తీసుకొని వైద్యురాలు ట్రీట్మెంట్ చేయడం ప్రారంభించింది అన్నారు.టెస్టుల కోసం ప్రైవేట్ ల్యాబ్లో సైతం ఉచితంగా పరీక్షలు చేయడం జరిగిందన్నారు.వచ్చిన గర్భిణీకి ఏడవ కాన్పు,ఇంతకుముందే ఐదుగురు పిల్లలు ఉన్నారని,అబార్షన్ సైతం జరిగిందన్నారు.ట్రీట్మెంట్ అందించే సమయంలో వైద్యురాలికి సహకరించాల్సింది పోయి ఆ విలేఖరి లొల్లి చేయడం వల్లే రెండు గంటల పాటు ఆలస్యం జరిగిందన్నారు.విధులకు ఆటంకం కలిగిస్తూ వైద్యురాలిపై ఇష్టానుసారంగా మాట్లాడడం సరికాదన్నారు.హిమోగ్లోబిన్ 7.8 శాతం ఉన్నందున గర్భిణీకి ఇబ్బంది ఏర్పడిందన్నారు.ప్రెగ్నెన్సీ ఉన్న సమయంలో నాలుగు వారాలు గౌరవ ఆసుపత్రిలోనే ఆమె ట్రీట్మెంట్ తీసుకోవడం జరిగిందని,ఇవన్నీ రికార్డుల్లో నమోదు కావడం జరిగిందన్నారు.పేషంట్లకు సేవలు అందించడమే బాధ్యత అని పనిచేసే సమయంలో డాక్టర్లను బెదిరించడం భావ్యం కాదన్నారు. ప్రజలు సహకరించాల్సిందిగా కోరారు.విధి నిర్వహణకు ఆటంకం కలిగించినయూట్యూబర్ పై పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు.తాము డాక్టర్లమని ప్రాణాలు కాపాడడానికి ప్రయత్నిస్తామని తమకు సహకరించాల్సిందిగా విన్నవించారు.

# దండుకోవడంలో ఘనాపాఠీలు




**బెల్ట్‌షాపుల్లో, బార్లలో బీర్లు ఫుల్.. కానీ వైన్స్‌లలో మాత్రం నిల్!**

**సోయిలేని అధికారులు.. నిద్రమత్తులో సిబ్బంది**

**ప్రజాపక్షం /బుగ్గారం :** నడుస్తున్నది ఎండాకాలం ఎండల తీవ్రత తట్టుకోలేనంత దీనివల్ల ప్రజలు ఇంట్లో నుండి బయటకు రాని పరిస్థితి అధిక ఉష్ణోగ్రత వల్ల కాస్త హాయిగా సేద తీరడానికి వేడిమికి ఊరటగా ఒక బీరు తాగుదామని వైన్స్ ల పక్కకి వెళితే బీర్లు నో స్టాక్ అనే బోర్డులు కనబడుతున్నాయి వచ్చిన కొద్దిపాటి స్టాక్ కూడా ఎప్పుడో అమ్ముడుపోయాయని వైన్స్ నిర్వాహకులు చెబుతున్నారు. ఇక బార్ల వైపు బెల్టుషాపుల వైపు చూస్తే జేబుకు చిల్లు పడాల్సిందే ఒక బీరు దొర లైట్ అయినా స్ట్రాంగ్ అయినా 200 పైనే తీసుకుంటూ మాకు కూడా బీరు దొరకడం లేదంటూ బెల్ట్ షాపు బార్ షాపులో ఓనర్లు చెప్తున్నారు. నిజానికి వారి బెల్ట్ షాపుల్లోకి వెళితే ఎన్ని కావాలంటే అన్ని లభిస్తాయి అని వారే చెప్తున్నారు. వైన్స్ ల లో లేని బీర్లు బెల్ట్ షాపులోకి ఎలా వస్తున్నాయి. ఇది మందుబాబుల మదిలో మెదిలే ప్రశ్న కొంతమంది ఉండలేక బీర్లు ఎందుకు దొరకడం లేదు వైన్స్ లలో అడుగుతే నీటి కొరత వల్ల బీర్లు తయారీ ఆగిపోయిందని యజమానులు చెప్తున్నారు. మరి అదే విషయం నిజమా అనుకుందామంటే గ్రామాల్లోని బెల్టు షాపుల్లో విచ్చలవిడిగా బీర్లు దొరుకుతున్నాయి ఇదేలా సాధ్యం నిజంగా తయారి ఆగిపోయిందా లేదంటే ఎలక్షన్ కోడ్ వల్ల అధికంగా సంపాదించే మార్గమా ఇది ఇలాగే కొనసాగితే సామాన్యునికి రాను రాను బీర్లు అందనీ ద్రాక్షగానే మారుతుంది. ఇప్పటికైనా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి ఎప్పటికప్పుడు బెల్ట్ షాపులపై చర్యలు తీసుకోవాలని, వారి జోరు తగ్గించాలని మందుబాబులు కోరుకుంటున్నారు.

## నేడు మండల సర్వసభ్య సమావేశం

ప్రజాపక్షం/ఆసిఫాబాద్ : ఆసిఫాబాద్ మండల సర్వసభ్య సమావేశమును బుధవారం నిర్వహిం చనున్నట్లు ఎంపిడిఓ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఎంపిడిఓ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపిపి మల్లికార్జున్ అధ్యక్షతన ఉదయం 11 గంటలకు నిర్వహించే సమావేశానికి మండల అధి కారులు, ప్రజా ప్రతినిధులు తమ నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు.

## సింగరేణి ఉద్యోగులు రక్తదానం చేయడం అభినందనీయం

జనరల్ మేనేజర్ బి. సంజీవరెడ్డి

ప్రజాపక్షం/శ్రీరాంపూర్ : సింగరేణి సంస్థ ఉత్పత్తితోపాటు సామాజిక సేవలో ముందుంటుందని, సంస్థ ఉద్యోగులు రక్త దానం చేయడం అభినందనీయమని శ్రీరాంపూర్ జనరల్ మేనేజర్ బి. సంజీవ రెడ్డి అన్నారు. మంగళవారం శ్రీరాం పూర్ ఏరియా లోని ఆర్కె 8 డిస్పెన్సరీలో నిర్వహించిన రక్త దాన శిబిరంలో ఎస్ఆర్‌పి 1, ఎస్ఆర్‌పి 3 గ్రూప్ ఆధ్వ ర్యంలో 66 మంది కార్మికులు రక్తదానం చేశారు. ఈ కార్యక్ర మానికి శ్రీరాంపూర్ ఏరియా జిఎం ముఖ్యఅతిథిగా హాజరై, రక్తదానం చేసిన ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని దానాల్లో కెల్లా రక్త దానం గొప్పదని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ యువ కిరణాలతో కళకళలాడుతోందని ఆనందం వ్యక్తం చేశారు. ఇలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్న రెడ్ క్రాస్ సొసైటీ వారికి కృతజ్ఞత అభినందనలు తెలియజేశారు. రక్త దాన శిబిరాల ద్వారా సేకరించిన రక్తాన్ని తలసేమియా, కిడ్నీ, క్యాన్సర్ వ్యాధిగ్రస్తులకు, గర్భిణీ స్త్రీలకు, ప్రభుత్వ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న నిరుపేదలకు ఉచితంగా అందిస్తున్నారని అన్నారు. రెడ్ క్రాస్ సొసైటీ వారు చేస్తున్న



సేవలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి గుర్తింపు సంఘం బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రటరీ మోత్కూరి కొమురయ్య, ఏరియా సెక్రటరీ మారేపల్లి సారయ్య, ఆర్కె 8 డిస్పెన్సరీ పిట్ సెక్రెటరీ విజయ, వేణు, మల్లేష్ పాల్గొన్నారు.

## విత్తనాలు, ఎరువుల కొనుగోలులో జాగ్రత్తలు

ప్రజాపక్షం/కాసిపేట : రైతులు విత్తనాలు, ఎరు వులు కొనుగోలులో తగు జాగ్రత్తలు వహించాలని మండల వ్యవసాయ అధికారిణి వందన సూచిం చారు. మంగళవారం కాసిపేట మండలంలోని కోనూరు గ్రామ పంచాయతీలో విత్తనాలు, ఎరు వుల వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసినప్పుడు రసీదు తప్పక తీసుకొని భద్రపర్చుకోవాలని, ప్రభుత్వ అనుమతి ఉన్న విత్తనాలు, ఎరువులను మాత్రమే లైసెన్స్ పొందిన షాపుల్లో కొనుగోలు చేయాలని తెలి పారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పాల్గొన్నారు.

## సింగరేణి ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలి

ప్రజాపక్షం/మందమర్రి : సింగరేణి హై స్కూల్‌లో వాకింగ్ ట్రాక్ మరమత్తులు చేపించాలని, సిఇఆర్ క్లబ్‌లో స్విమ్మింగ్ పూల్ వాటర్ ఫిల్టరైజేషన్ చేయాలని గుర్తింపు కార్మిక సంఘం (ఏఐటియుసి) బ్రాంచ్ కార్య దర్శి సలేంద్ర సత్యనారాయణ మందమర్రి ఏరియా జిఎంను కోరారు. మంగళవారం ఏరియా జిఎంతో గుర్తింపు సంఘం ఏఐటియుసి నాయకులు సమావేశమై కార్మికుల సమస్యలు, సింగరేణి ప్రాంత అభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏరి యాలోని గనుల్లో నూతన ఎస్‌డిఎల్ యంత్రాలను ప్రవేశ పెట్టాలని, కాలం చెల్లిన యంత్రాలతో నిర్దేశిత బొగ్గు ఉత్పత్తి లక్ష్యం కష్టం అవుతుందని తెలిపారు. సింగరేణి కార్మిక ప్రాంత అభివృద్ధికి కృషి చేయాలని, కార్మికుల, కార్మికుల కుటుంబాల సంక్షేమానికి కార్మిక వాడల్లో, సింగరేణి ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపట్టాలని కోరారు. కార్మిక సంఘం నాయకులు తెలిపిన అంశా లపై జిఎం సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

## విత్తనాలు కొన్నప్పుడు రశీదు తప్పకుండా తీసుకోవాలి

ప్రజాపక్షం/సోన్ : మం డలంలోని బొప్పారం గ్రామంలో మంగళ వారం వ్యవసాయ అధి కారి వినోద్ కుమార్ రైతు



లకు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తీసుకోవలసిన జాగ్ర త్తల పై అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.వీరు మాట్లా డుతూ విత్తనాలు తీసుకునే సమయములో డీలర్ దగ్గర నుండి తీసు కొని పంట దిగుబడి వచ్చేవరకు పంట కాలం పూర్తి అయే వరకు రైతు దగ్గర భద్ర పరుచుకోవాలి.తీసుకున్న రసీదు మీద విత్తన కంపెనీ పేరు,రకము,బ్యాచ్ నంబర్,లాట్ నంబర్,రేటు ఉండాలి విత్తన పాకెట్ మీద తయారు అయినా తేదీ,కాలం ముగిసిన తేది చూసుకోవాలి.గ్రామంలో తక్కువ,ఎక్కువ ధరకు అమ్మే వారి వివ రాలు వ్యవసాయ అధికారులకు చెప్పాలి. దయచేసి తొందర పడి లైసెన్స్ లేని డీలర్ దగ్గర విత్తనాలు తీసుకొని ఇబ్బంది పడవద్దు అని, వానాకాలపు పంటలపై పచ్చి రొట్ట ఎరువులపై అవగాహన కార్యక్రమం కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఏఈఓ అంబాజీ, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## విత్తనాల కొనుగోలుపై రైతులకు అవగాహన

ప్రజాపక్షం/సిర్పూర్ టి : రైతులు విత్తనాలు కొనుగోలు చేసే క్రమంలో అప్రమత్తంగా ఉండా లని, విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో ప్యాకెట్లపై లేబుల్, ప్యాకింగ్ తేదీ, గడువు తేదీ, లాట్ నెంబర్‌లను పరిశీలించాలని వ్యవ



సాయ అధికారి మధులత అన్నారు. మంగళవారం సిర్పూర్ టి మండల కేంద్రంలోని పాలు, పారిగాం, భూపల పట్నం, సిర్పూర్ టి గ్రామాలలో రైతులకు విత్త నాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఈ సంద ర్భంగా ఆమె మాట్లాడుతూ లైసెన్స్ పొందిన షాపుల వద్ద మాత్రమే రైతులు విత్తనాలు కొనుగోలు చేయాలని, దళారులను నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. విత్తనాలు కొనేట ప్పుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవా లని, నకిలీ విత్తనాలు తీసుకోవద్దని, నకిలీ విత్తనాలు అమ్మకం చేస్తున్నట్లు సమాచారం ఉంటే వ్యవసాయ శాఖ అధికారులకు తెలపాలన్నారు. రైతులు నష్ట పోకుండా జాగ్రత్తపడాలని తెలిపారు. అనంతరం మండలంలోని విత్తనాల షాప్ లను తనిఖీ చేసి విత్తన ప్యాకెట్లను, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో ఏఇఓ లు శ్రీనివాస్, కవిత, శోభారాణి, తదితరులు పాల్గొన్నారు.

## వారణాసిలో ఎన్నికల ప్రచారంలో ఎంఎల్ఏ



ప్రజాపక్షం/బైంసా : ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పోటీ చేస్తున్న వారణాసిలో ఎన్నికల ప్రచా రంలో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ పాల్గొ న్నారు.బిజెపి నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి,ఎన్ని కల కమిటి చైర్మన్ ఈటెల రాజేందర్,కలిసి ఆయన వారణాసి వెళ్లారు.అక్కడ తెలుగు వాళ్ళ దగ్గరికి వెళ్లి ప్రధాని మోదీ నాయకత్వాన్ని బలప రచాలని,బిజెపికి ఓటు వేయాలని కోరారు.

## బావిలో పడి ఒకరు మృతి..



ప్రజాపక్షం/సోన్ : మండలంలోని బొప్పారం గ్రామ పొలిమేరలో గల వ్యవసాయ బావిలో ప్రమాదవ శాత్తు పడి ఒకరు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది.పోలీ సులు తెలిపిన కథనం ప్రకారం లక్ష్మణ్ చందా మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన బట్టు రాజు (25) గత కొద్ది సంవత్సరాల నుండి మానసిక స్థితి సరిగా లేని అతనిని ఇనుప గొలుసులతో కట్టి వేసేవారని సోమవారం నుండి బయలుదేరిన రాజు ఎంతసేపటికి ఇంటికి రాకపోయే సారికి చుట్టుపక్కల వెతికిన ఆచూకీ కనిపించలేదు.మంగళవారం బొప్పారం గ్రామ శివారం లోగల వ్యవసాయ బావిలో మృతి చెంది నట్లు తెలుసుకొని సంఘటన స్థలానికి వెళ్ళి మృతదేహాన్ని పరిశీలిం చగా నీరు తాగడానికి వెళ్లి మరణించినట్లు అనిపిస్తుందని అన్నారు.మృతుని తండ్రి ముత్యం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సంతోషం రవీందర్ తెలిపారు.

## ఎన్‌టిఆర్‌కు ఘన నివాళ్ళు అర్పించిన : మున్సిపల్ చైర్మన్

ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : తెలుగుదేశం పార్టీ వ్యవస్థా పకులు,మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ నందమూరి తారక రామారావు 101వ జయంతి ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని పురపాలక సంఘ కార్యాలయంలో పార్టీలకు అతీతంగా మంగళవారం ఎన్.టి.ఆర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అటు నటుడిగా..ఇటు రాజకీయ నాయకు డిగా ప్రత్యేకత చాటుకున్న ఎన్టీఆర్ మరణించి కొన్ని సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ తెలుగువారి గుండెల్లో నిలిచే ఉన్నారు.ఎన్టీఆర్ జయంతి వర్ధంతి వేడు కలను తెలుగు రాష్ట్రాల్లో ఎంతో ఘనంగా నిర్వహిస్తూ ఆయన సేవలను గుర్తుచేసుకుంటున్నారని,అభిమానులు గతేడాది నందమూరి తారక రామారావు శత జయంతి



వేడుకలను ప్రపంచవ్యాప్తంగా తెలుగు వారు ఎంతో ఘనంగా నిర్వహించుకున్నారని తెలిపారు.తెలుగువారి ఆత్మగౌరవానికి,ప్రజాహిత పాలనకు ప్రతీక స్వర్గీయ నందమూరి తారక రామారావు అని,రెండు రూపాయ లకే కిలో బియ్యాన్ని అందజేసి పేదవారి గుండెల్లో చోటు సంపాదించుకున్న మహానీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిల్ సభ్యులు, నాయకులు ఉన్నారు.

## విత్తనాల కొనుగోలుకు సిద్ధమవుతున్న రైతులు..



ప్రజాపక్షం/ముధోల్ : రాబోయే ఖరీఫ్ సీజన్ కి వర్షాలు తొందరగా పడుతాయానే వార్తలు అందగా రైతులు తమ పంట పొలాలను దున్ను కుని విత్తడానికి సిద్ధం చేసుకున్నారు.విత్తడానికి కావాల్సిన విత్తనాలను ఇప్పటికే కొందరు రైతులు కొనుగోలు చేయగా మిగిలిన రైతులు సైతం మార్కెట్లో ఉన్న విత్తనాల గుర్చి ఆరా తీసి తమకు అనుగుణంగా ఉన్న విత్తనాలను కొనుగోలు చేసు కుంటున్నారు. మార్కెట్లో లభ్యం కావడం లేదు. కొన్ని రకాల విత్తనాలు మాత్రమే ఇక్కడి మార్కెట్లో లభ్యమవుతున్నాయి. దీంతో తమకు కావాల్సిన విత్తనాలు దొరకక పోవడంతో ఇక్కడి రైతులు బైంసా అదువిధంగా పక్క రాష్ట్రమైన మహారాష్ట్ర లోని ధర్మాబాద్‌కు వెళ్తున్నారు. ప్రయివేట్ వ్యాపా రుల వద్ద కాకుండా ప్రభుత్వమే తమకు విత్తనా లను విక్రయించినటయితే రైతులకు మేలని కొందరు అభిప్రాయ పడుతున్నారు.

## ఎన్‌టిఆర్ యుగపురుషుడు..



ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట : కీర్తి గడించిన ఎన్టీఆర్ భావి తరాలకు తరగని స్ఫూర్తి,పద్మశ్రీ ఎన్టీఆర్ యుగపురు షుడు అని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు సూర్య నాయక్ తెలిపారు.రాజన్నసిరిసిల్లాలోని ఎల్లారెడ్డిపేట మండలం కొత్త బస్టాండ్ వద్ద ఎన్టీఆర్ 101 జయంతి రోజున ఆయన చిత్రపటానికి రాష్ట్ర నాయకులు,ఎస్టీ సెల్ అధ్యక్షులు సూర్యానాయక్ పూలమాల వేసి ఘన నివా ళులు అర్పించారు.మంగళవారం ఆయనను గుర్తు చేసు కుని మాట్లాడారు. మూడంచెల వ్యవస్థ ఏర్పాటు ఆయన ఉమ్మడి రాష్ట్ర తెలుగు ప్రజలకు ఎనలేని సేవలు అందిం చారని అన్నారు. కార్యక్రమంలో సూర్యానాయక్, చంద్రా రెడ్డి, పోచయ్య, రాములు పాల్గొన్నారు.

## ఘనంగా ఎన్‌టిఆర్ జయంతి వేడుకలు



ప్రజాపక్షం/చందుర్తి : చందుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు జయంతి వేడుకలను వెంకటేష్ ఆధ్వ ర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ స్వర్గీయ ఎన్టీఆర్ తెదేపాను స్థాపించి బడుగు బలహీనవర్గాలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఆయన సేవ లను కొనియాడుతూ భవిష్యత్తులను తెలుగుదేశం పార్టీ బడుగు బలహీన వర్గాలకు అండగా ఉంటుందని ఆయన చూపిన మార్గాన్ని కొనియాడుతామని పేర్కొన్నారు.

## రాష్ట్ర వ్యాప్తంగా కులగణన చేపట్టాలి

పెంచుతూ ప్రత్యేక చట్టం (అరినెన్స్) తీసుకురావాలి



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : పార్లమెంట్ ఎన్నికలు కోడ్ ముగిసన తక్షణమే తెలంగాణా రాష్ట్ర వ్యాప్తంగా కులగణన ను ప్రభుత్వం చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘము జిల్లా గౌరవ అధ్యక్షులు డా.ఉప్పు.కృష్ణంరాజు అధ్యక్షులు ఎంబడి.చంద్రశేఖర్ తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసారు మంగళవారం వారు ఒక పత్రిక ప్రకటన విడుదల చేస్తూ గతంలో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ కుటుంబాల వారికి రిజర్వేషన్లు ద్వారా చాలా అన్యాయం జరి గిందని వారు ఆవేదన వ్యక్తం చేశారు.మరో వైపు తెలంగాణా రాష్ట్ర ప్రభుత్వం ముందుగా 42 శాతానికి బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని తరహాలో తెలం గానా అసెంబ్లీలో బీసీ లకు స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ ఆర్డినెన్స్ తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు.

## సీతారామచంద్రస్వామి ఆలయానికి రూ. 2లక్షల విరాళం

**ప్రజాపక్షం/ఇల్లందకుంట :** ఇల్లందకుంట మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్తానం అభివృద్ధికి శ్రీరామనవమి కళ్యాణం రోజున రూ.2 లక్షలు విరాళంగా ప్రకటించిన కాంగ్రెస్ ఎంపి అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావు మంగళవారం ఆ మొత్తాన్ని దేవస్థానానికి అందజేశారని ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల సుధాకర్ తెలిపారు. దేవస్థాన అభివృద్ధికి తన వంతుగా సాయం చేసిన వెలిచాల రాజేందర్‌రావు కృతజ్ఞతలు తెలియజేశారు. '

## స్నేహితురాలికి ఆర్థిక సాయం చేసిన పూర్వ విద్యార్థులు



**ప్రజాపక్షం/గంగాధర :** తమతో చదివిన బాల్య మిత్రురాలు కష్టాల్లో ఉందని తెలిసి అండగా నిలిచారు తోటి పూర్వ విధ్యార్థులు. గంగాధర మండలం బొమ్మకంటిపల్లి గ్రామానికి చెందిన గట్ల సౌమ్య భర్త పవన్ కుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. ప్రమాదంలో ఎడమ కాలుకు తీవ్ర గాయాలు కాగా హైదరాబాద్‌లోని యశోధకు హాస్పిటల్‌కు తరలించగా వైద్యులు కాలును తొలగించారు. విషయం తెలుసుకున్న పూర్వ విధ్యార్థులు గౌతమి, లావణ్య, వినయ్ కలిసి కొంత డబ్బు జమ చేశారు. అలా జమ చేసిన రూ.25వేలు నగదును స్నేహితురాలి ఇంటికి వెళ్లి ఆర్తిక సహాయం అందజేశారు. అనంతరం ఆమె భర్త సంజయ్ కుమార్‌ను పరామర్శించారు. కాగా ప్రమాద విషయం తెలుసుకున్న బిజెపి ఓబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు దూలం కళ్యాణ్, బొమ్మకంటి రాజిరెడ్డి కలిసి రూ.5వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

## భారంగా మారిన నర్సరీల నిర్వహణ


**ప్రజాపక్షం/బోథ్ :** బోథ్ పెంచుతున్న నర్సరీ తీవ్రమైన ఎండల ప్రభావం వల్ల నర్సరీ ల పెంపకానికి తీవ్రమైన ఆటంకాలు ఏర్పడుతున్నాయి.ఒక వైపు తీవ్రమైన ఎండలు మరో వైపు వేగంగా భూగర్బ జలాలు అడుగంటి పోవడంతో నర్సరీలకు నీటి తడులను పెట్టడం సాధ్యం కాకపోవడంతో అనేక గ్రామాల్లో నర్సరీలలో మొక్కలు నాటుకోలేదు.అయితే వర్షాకాలం సమీపిస్తుండటంతో నర్సరీల నిర్వాహకులు మరోసారి విత్తనాలను నాటాల్సిన అవసరం ఏర్పడుతుందని అంటున్నారు.లయితే ఈ ఏడాది ప్రభుత్వం గతంలో కంటే తక్కువగానే మొక్కలను నాటి ఆస్కారం ఉంది. ఏది ఏమైనా తీవ్రమైన ఎండలతో నర్సరీల నిర్వహణ కష్టతరంగా మారింది.

## స్నేహితుడి కుటుంబానికి బాసటగా నిలిచిన మిత్రులు

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబహీంపట్నం మండల కేంద్రానికి చెందిన కలాల ప్రవీణ్ భార్య హాస్పిటల్లో చికిత్స పొందుతూ అనారోగ్యంతో ఇటీవలే కొద్ది రోజుల క్రితం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న తమ చిన్ననాటి స్నేహితుడి కుంటుంబ పరిస్థితి తెలుసుకున్న 20022003 పదవ తరగతి బ్యాచ్ కు చెందిన స్నేహితులు కొంత డబ్బులు జమ చేశారు. వారు జమ చేసిన 43 వేల 500 రూపాయలను మంగళవారం స్నేహితుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, అట్టి నగదును ప్రవీణ్‌కు అందజేశారు.

# ఘనంగా రేణుక ఎల్లమ్మ కల్యాణం

**ప్రజాపక్షం/ఇబ్రహీంపట్నం :** జగిత్యాల జిల్లా ఇబ్రహీం పట్నం మండల కేంద్రంలో ఆరు రోజులుగా ఎల్లమ్మ పండుగ ఉత్సవాలుగౌడ కులస్థుల ఆధ్వర్యంలో ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా ఆరవ రోజు చివరి రోజు అయిన మంగళవారం రోజున గౌడ సంఘానికి చెందిన మహిళలు పెద్ద ఎత్తున బోనాలతో గ్రామంలోని వీధుల గుండా ఆలయానికి బయలుదేరగా, పోతరాజుల విన్యాసాలు, ఎల్లమ్మ వేషధారణలతో గ్రామప్రజలను ఆకట్టుకున్నాయి. పిల్లాపాపలతో కలిసి బోనాలతో మహిళలు ఆలయానికి బయలుదేరి అమ్మ వారికి నైవేద్యం సమర్పించారు. అనంతరం గౌడ పూజారులు ఎల్లమ్మ ఆలయం వద్ద పట్నాలు వేసి రేణుక ఎల్లమ్మ కళ్యాణాన్ని రమణీయంగా నిర్వహించారు. రేణుక ఎల్లమ్మ ఆలయంలో పలువురు ప్రముఖులు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ జువ్వాడి నర్సింగరావు, తెలంగాణ జన సమితి పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కంతి మోహన్ రెడ్డి, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు గొల్లపల్లి చంద్రశేఖర్ గౌడ్, గౌడ సంఘం రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ చర్లపల్లి ఆనంద్ గౌడ్, పూదరి నర్సాగౌడ్, చెట్లపల్లి సత్యనారాయణ గౌడ్, ఎంపిటిసి తిమ్మని రాములు, మాజీ ఎంపిపి పుష్పలత దేవి, ఆయా పార్టీల మండల అధ్యక్షులు గూడ శ్రీకాంత్, కంతి రమేష్, చింతకుంట శంకర్, ఇరు పార్టీల పలువురు కార్యకర్తలు, పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అనంతరం గౌడ సంఘం ఆధ్వర్యంలో ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం సభ్యులు మహిళలు పాల్గొన్నారు.

## యశోదా అసుపత్రిలో అరుదైన ఆపరేషన్



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** జగిత్యాల జిల్లాకు చెందిన ప్రణిత (33) అనే మహిలకు కోత లేకుండా మెదడులోని రక్తనాళానికి అరుదైన ఆపరేషన్ నిర్వహించినట్లు యశోధ ఆసుపత్రి హైదరాబాద్ వైద్యులు ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ మోహన కృష్ణ, ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ శ్రీహరీష్ తెలిపారు. కరీంనగర్ లోని యశోద కేంద్రంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ గత 4 సంవత్సరాల నుంచి తలనొప్పి, తలతిప్పడం, వాంతుల సమస్యలతో బాధపడుతున్న మహిళ కరీంనగర్‌లోని అనేక ఆసుపత్రలును సంప్రదించిన తర్వాత మందులతో తగ్గదని, మెదడులో నీరు చేరిందని , దాన్ని ఆపరేషన్ ద్వారా తీసివేసి జీవితకాలం మందులు వాడాల్సి ఉంటుందని ఇక్కడి వైద్యులు తెలిపారని, దానికి భయపడి హైదరాబాద్ యశోదకు వస్తే పూర్తి నిర్ధారణ చేసి ఇది ఇంటియోపతిక్ ఇంట్రాక్రానియల్ హైపర్‌టెన్షన్ అని గుర్తించామని తెలిపారు. దీని వల్ల మెదడులో ఒత్తిడి పెరుగుతుందని, కొద్దిరోజులుగా కళ్లు మసకబారుతున్నాయని ఫిర్యాదు చేసిందని తెలిపారు. ఆపరేషన్ చేయడానికి నిర్ణయించగా ఈ ప్రక్రియలో చిన్న పరికరం ద్వారా స్టంట్‌ను తొడలోని రక్తనాళం ద్వారా దేహంలోకి పంపి ప్రభావితమైన సైనస్ అమర్చడం జరుగుతుందని, దీని వల్ల రక్త ప్రవాహం మెరుగుపడి పుర్రెలో ఒత్తిడి తగ్గడం జరుగుతుందని వివరించారు. రోగికి ఎటువంటి కోత, నొప్పి లేకుండా త్వరగా కోలుకునే విధంగా మొట్టమొదటిసారిగా విజయవంతంగా ఆపరేషన్ నిర్వహించామని, స్టంట్ వేసిన తర్వాత అప్పటికప్పుడు నొప్పి నుంచి ఉపశమనం పొందిందని, మూడు రోజుల డిశ్చార్జి తర్వాత పూర్తిగా కోలుకుందని తెలిపారు.

## ఫోన్ ట్యాపింగ్ చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/మల్లాపూర్ :** గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అధికారంలోకి రావాలనే వంకర బుద్ధితో ఫోన్ ట్యాపింగ్‌లకు పాల్పడ్డారని, దానికి సహకరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు జలపతి రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం మండలకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ అప్పటి ముఖ్యమంత్రి స్థానిక ఎమ్మెల్యే ఇంటిపేరు ఒకటే కావడంతో ఓడిపోతే తలెత్తుకోలేమనే ఉద్దేశ్యంతో కాంగ్రెస్ పార్టీ కోరుట్ల ఎమ్మెల్యే అభ్యర్థిజువ్వాడి నర్సింగరావు ఫోన్ ట్యాప్ చేసి ఆయన గెలుపుకు అడ్డు తగిలారని, విషయం బయటకు రావడంతో అసత్యపు ప్రచారాలు మాట్లాడుతున్నారని, ఇప్పటికైనా ప్రజాక్షేత్రంలోకి వచ్చి ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి తమ అభ్యర్థి నర్సింగరావుపై గెలవాలని సవాల్ విసిరారు. ఈ కార్యక్రమంలో నాయకులు మైనార్టీ సెల్ జిల్లా జాయింట్ సెక్రటరీ మహమ్మద్ రఫీ, శ్రీనివాస్ రెడ్డి, జీవన్ రెడ్డి, నల్ల బాబు రెడ్డి, సత్పత్ రెడ్డి, లక్ష్మారెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లయ్య, రాకేష్, భూమయ్య, శేఖర్ పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా కడెం కుడి కాలువ



**ప్రజాపక్షం/కడెం :** కడెం జలాశయం కుడి కాలువ నిర్వహణ లేక అస్తవ్యస్తంగా తయారవుతుంది.కుడి కాలువ కింద కడెం మండలంలోని ఏడు గ్రామాల్లో సుమారు 2500 ఎకరాలకు సాగునీరు అందుతుంది నిర్మల్,మంచిర్యాల రహదారిపై కడెంలో ఎస్బిఐ ఎదురుగా ఉన్న కుడి కాలువ సైఫన్ వద్ద కాలువ రెండేళ్ల క్రితం మరమత్తుకు గురుయింది.గండిపడి నీరు బయటకు పోవడంతో చివరి ఆయకట్టుకు నీరు సరిగా అందడం లేదని రైతులే ఏడాది క్రితం ఇక్కడ ఇసుక సంచులు వేసి మరమ్మతులు చేసుకున్నారు.ఇక్కడ మరమత్తులు చేయిస్తామన్న అధికారులు ఏడాదిగా అటువైపు చూడనే లేదు.కాలువ పరిస్థితి ఇప్పటికీ అలాగే ఉంది.ఈ సారి మరమత్తులు చేపట్టకుండా కాలువకు నీటిని వదిలితే మళ్లీ బుంగపడి రైతులకు ఇబ్బందులు తప్పేలా లేవు సైఫేన్ కు ఎగువన కాలువ గట్లపై చెట్లు ఏపుగా ఎదుగుతున్నాయి వేప చెట్లతో పాటు ఇతర చెట్లు కాలువ గటుటపై సిమెంట్ లైనింగ్ ను దెబ్బతీస్తున్నాయి.అవి అలాగే పెరిగితే లక్షలు వేచించి చేయించిన లైనింగ్ మొత్తం పగిలిపోయి కాలువకు మరిన్ని బుంగలు పడే ప్రమాదం ఉంది.కాలువలో పూడిక మట్టి సైతం పేరుక పోయింది కాలువపై అధికారులు పర్యవేక్షణ కొరవడి అస్తవ్యస్తంగా తయారవుతుందని రైతులు పేర్కొంటున్నారు.కాలువ పై పెరుగుతున్న చెట్లను తొలగించి కడెం నుంచి కొండూకూర్ చెరువు వరకు మెరుగుపడాల్సిన అవసరం ఉంది.

## భారీ అగ్నిప్రమాదం...


*** దాదాపు 300 పై చిలుకు ఈతవనం దగ్ధం.**

**ప్రజాపక్షం/బుగ్గారం :** బుగ్గారం మండలంలోని సిరికొండ మద్దునూరు గ్రామాలకు చెందిన గీత కార్మికులకు ఉపాధి అందించే ఈతవనంలో మంగళవారం గుర్తు తెలియని వ్యక్తుల వల్లభారీ అగ్ని ప్రమాదం సంభవించింది. దీనిలో దాదాపు 300 పై చిలుకు ఈతవనం దగ్ధం అయింది. దీంతో గీతా కార్మికులకు భారీ నష్టాన్ని కలిగించింది. ఈ సంఘటన జరగడం వల్ల మద్దునూరు సిరికొండ గ్రామాలకు చెందిన దాదాపు 100 గీతా కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. వేసవి కాలం కావడంతో గుర్తు తెలియని వ్యక్తులు పొలాలలో చెత్త చెదారం కాల్చడం వల్ల ఈ ప్రమాదం జరిగింది. ఈ అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించిన బుగ్గారం మండల గౌడ సంఘం అధ్యక్షుడు మూల శ్రీనివాస్ గౌడ సంఘం సభ్యులను పరామర్శించారు. అదే విధంగా బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని అన్నారు. వారికి తగిన ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. సంబంధిత అధికారులు సంఘటన ప్రదేశాన్ని పరిశీలించి దోషులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట పాకాల శ్రీనివాస్, భూమన్న గౌడ్, తిరుపతి గౌడ్, గౌడ సంఘం సభ్యులు ఉన్నారు.

## ఎంఎల్‌సి జీవన్‌రెడ్డిని కలిసిన మున్నూరు కాపు సంఘం సభ్యులు

**ప్రజాపక్షం/జగిత్యాల జిల్లా ప్రతినిధి :** జగిత్యాల జిల్లా మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షులు వొడ్నాల రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి చిట్ల రమణ సంఘం నాయకులు, సభ్యులు మంగళవారం రోజున కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ తాటిపర్తి జీవన్ రెడ్డిని జగిత్యాల లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జీవన్ రెడ్డి అధ్యక్ష, కార్యదర్శులను సన్మానించి, అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం నాయకులు సౌళ్ళ భీమయ్య, రాచకొండ శ్రీరాములు, తాండ్ర సురేందర్, మసర్ధి రాజిరెడ్డి, లైసెట్టి వెంకటి, తాడేపు రమణ, వెంకన్న, రాజమౌళి, ప్రభాకర్ ఉన్నారు.

## కెల్విన్‌లో అరుదైన క్యాన్సర్ ప్లాస్టిక్ సర్జరీ విజయవంతం



**ప్రజాపక్షం/కరీంనగర్ టౌన్ :** అత్యంత అరుదైన క్యాన్సర్, ప్లాస్టిక్ సర్జరీ ఆపరేషన్ నగరంలోని కెల్విన్ హాస్పిటల్‌లో విజయవంతమైంది. జగిత్యాల జిల్లాకు చెందిన పేషెంట్ తొడబాగంలో నరాలకు సంబంధించిన గడ్డతో బాధ పడుతుండగా కెల్విన్ హాస్పిటల్‌లో ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ అశోక్ రెడ్డిని కలిశారు. స్కానింగ్ చేయగా ఆ గడ్డ తొడ బాగం నుంచి నరాల ద్వారా తొంతి ఎముక నుంచి కడుపులోకి చొచ్చుకుపోతున్నట్లు గుర్తించారు. ఇలాంటి కేసులు ప్రపంచ వ్యాప్తంగా పదికన్నా తక్కువగా నమోదు కావడం గమనార్హం, క్యాన్సర్ సర్జన్ డాక్టర్ దొంతుల ప్రశాంత్, ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ అశోక్ రెడ్డి, మత్తు వైద్యులు డాక్టర్ త్రివిక్రమ్ కలిసి7 గంటలలో సర్జరీ పూర్తి చేశారు. డాక్టర్ సురేష్ కుమార్, క్రిటికల్ కేర్ స్పెషలిస్ట్ ఆద్వర్యంలో పేషెంట్ పూర్తిగా రికవరీ అయి డిశ్చార్జి అయినట్లు కెల్విన్ హాస్పిటల్ యాజమాన్యం తెలిపారు. తనకు ఇంత అరుదైన సర్జరీ తక్కువ ఖర్చులో మన కరీంనగర్‌లో జరగడం పట్ల పేషెంట్ హర్షం వ్యక్తం చేశారు.

# ఖని స్మశానంలో సకల సౌకర్యాలు కల్పించాలి

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : గోదావరిఖనిలోని గోదావరి నది ఒడ్డునున్న హిందూ స్మశాన వాటికలో సకల సౌకర్యాలు కల్పించాలని డిహెచ్పిఎస్ నాయకులు కందుకూరి రాజారత్నం మద్దెల దినేష్, ఎర్రల రాజయ్య తొడుపునూరి రమేష్ కుమార్, గంగరపు ప్రసాద్ లు డిమాండ్ చేశారు.మంగళవారం రోజున హిందూ స్మశాన వాటికలో డిహెచ్పిఎస్ దళిత హక్కుల పోరాట సమితి బృందం స్మశాన వాటికను సందర్శించారు. అనంతరం మద్దెల దినేష్ ,రాజ రత్నం మాట్లాడుతూ దురదృష్టశాత్తు వల్ల ఎవరైనా మృత్యువత పడితే హిందూ స్మశాన వాటికలో దహన నమస్కారాలు చేయాలంటే, వ్యాపారంగా మారిందని ఆర్థికంగా చాలా ఇబ్బందులు మృతి చెందిన వ్యక్తి కుటుంబ సభ్యులు ఎదుర్కొంటున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. స్మశానవాటికలో పూర్తిగా సౌకర్యాలు కరువు అయ్యాయని కనీసం మంచినీటి సౌకర్యం కూడా లేకుండా ఉండడం బాధాకరమని, విద్యుత్ దీపాలు వెలిగే పరిస్థితి లేదని అదేవిధంగా విద్యుత్ & గ్యాస్ దహన సంస్కారాల యంత్రం దాదాపు 15 ఏళ్ల కింద నగరపాలక సంస్థ తరఫున 30 లక్షలు పెట్టి కొనుగోలు చేసి నేడు అది తుప్పు పట్టి శిధిలావస్థకు చేరుతుందని దాని కొరకు 60 లక్షల రూపాయలు పెట్టి ఒక పెద్ద షెడ్డు నిర్మాణం చేయడం జరిగిందని, దాదాపుకోటి రూపాయల ప్రజాధనం వృధాగా అవుతుందని కావున అట్టి యంత్రాన్ని పనిచేసే విధంగా చూడాలని సంబంధించిన అధికారులను వారు డిమాండ్ చేశారు. అదేవిధంగా పాత పద్ధతిలోనే దహన సంస్కారాలను ఉచితంగా చేయాలని స్మశానన్ని పార్కు లాగా తీర్చిదిద్దాలని చుట్టూ కాంపౌండ్ వాల్ పూర్తిగా కూలిపోయిందని వాటిని చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించాలని డిమాండ్ చేశారు. స్మశానం అభివృద్ధి



కొరకు సింగరేణి, మున్సిపల్ కార్పొరేషన్, ఎన్టిపిసి సంస్థలు అభివృద్ధి చేయాలని దళిత హక్కుల పోరాట సమితి పక్షాన సంబంధించిన అధికారులను, గౌరవ శాసనసభ్యులను వారు కోరారు. స్మశానం పట్ల నిర్లక్ష్య వైఖరి వహిస్తే స్మశానం ముందు, మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ముందు ఆందోళనలు తప్పవని వారు హెచ్చరించారు.

## భూకబ్జాకు యత్నిస్తున్న కౌన్సిలర్

ప్రజాపక్షం/జమ్మికుంట : మండలంలోని ధర్మారం గ్రామ శివారులో గల సర్వే నెంబర్ 368లో గల ప్రభుత్వ భూమిలో తాత ముత్తాతల నుంచి సాగు చేసుకుంటున్నామని, ఈ క్రమంలోనే 2005లో బార్య గొడుగు ఈశ్వరమ్మ పేరిట పట్టా పొందడం జరిగిందని అదే గ్రామానికి చెందిన గొడుగు సారయ్య తెలిపారు. 2001 నుంచి 2010 వరకు పహానీలో పట్టా కబ్జాకు రావడం జరిగిందని, అన్ని ఆధారాలున్నప్పటికీ ధర్మారం 1వ వార్డు కౌన్సిలర్ వీరన్న అనే వ్యక్తి అట్టి భూమిపై కన్నేసాడని, దాన్ని లాక్కునేందుకు అన్ని రకాల ప్రయత్నాలు చేస్తున్నాడని, అందులో భాగంగా అధికారులను, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆరోపించారు. అధికారులు స్పందించి అట్టి భూమిపై హక్కులు తమవేనని, న్యాయం చేయాలని కోరారు.

## నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన

ప్రజాపక్షం/పెంచికల్ పేట్ : రైతులు లూజ్ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని, ప్రభుత్వం అనుమతించిన దుకాణాల్లోనే లైసెన్స్ పొందిన షాపుల వద్ద విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేయాలని ఎడిఎ రాజుల నాయుడు, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీవిద్య అన్నారు. మండలంలోని కొండపల్లి గ్రామంలో నకిలీ విత్తనాలపై మంగళవారం రైతులకి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు లైసెన్స్ కలిగన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని, ఎవరైన లూజ్ విత్తనాలు అమ్మితే వ్యవసాయశాఖ వారికి తెలిజేయచేయాలన్నారు. విత్తనాలు కొన్నప్పుడు బిల్లు తప్పని సరిగా తీసుకోవాలని, ఆ పంట కాలం అయిపోయే వరకు బిల్లును భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. రైతుకు ఇచ్చిన బిల్‌లో లాట్ నంబర్, వెరైటీ పేరు, తయారీ తేదీ వంటి విషయాలు ఉన్నావా లేవా చూసుకోవాలన్నారు. (హెచ్‌డిపిఎస్) పత్తి పంట దిగుబడి పై రైతులకు వివరంగా తెలియజేయడం జరిగిందని వేసవి దుక్కులు, పచ్చిరొట్ట ఎరువులు ద్వారా కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ రైతులు పాల్గొన్నారు.


## పోలీస్ కుటుంబానికి చెక్కు అందజేసిన ఎస్పి



ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ : ఆకస్మికంగా మరణించిన హెడ్ కానిస్టేబుల్ కుటుంబానికి పోలీస్ భద్రత నుండి మంజురైన చెక్కును జిల్లా ఎస్‌పి జి జానకి షర్మిల ఐపిఎస్ అందజేసారు. వివరాల్లోకి వెళితే బైంసా టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న బాలజీ ఎఎస్ఐ నం.1668 అనారోగ్యంతో బాధ పడుతూ మార్చ్ 01వ తేదీన మరణించాడు దీనితో తెలంగాణ పోలీస్ భద్రత పథకం ద్వారా మరణించిన ఏఎస్ఐ కుటుంబానికి మంజురు చేసిన 7,99,895/ రూపాయల చెక్కును జిల్లా ఎస్పీ చేతుల మీదుగా ఏఎస్ఐ సతీ మణి సురేఖకి అందజేసారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మరణించిన ఏఎస్ఐ కుటుంబ స్థితిగతులపై ఆరా తీయడంతో పాటు, శాఖపరంగా రావల్సిన బెనిఫిట్లను అందజేసేందుకు తక్షణ చర్యలు గైకొనాల్సిందిగా ఎస్పీ సంబంధిత అధికారలను ఆదేశించారు. ఈ కార్యక్రమములో ఏ.ఓ యూనుస్ అలీ,పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధి విరాసత్ అలీ పాల్గొన్నారు.

## కౌంటింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి

### రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : జూన్ 4న పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ అన్నారు. మంగళవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ ఇతర రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులతో కలిసి ఎన్నికల కౌంటింగ్ నిర్వహణ ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ మాట్లాడుతూ, జూన్ 4న నిర్వహించు పార్లమెంటు ఎన్నికల కౌంటింగ్ కు సకల ఏర్పాట్లు పూర్తిచేయాలని, కౌంటింగ్ సజావుగా నిర్వహించేందుకు కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కౌంటింగ్ కేంద్రం వద్ద పటిష్ట బందోబస్తు ఉండేలా చూసుకోవాలని, గుర్తింపు కార్డులు ఉన్న వారిని మాత్రమే కౌంటింగ్ కేంద్రాలకు అనుమతించాలని అన్నారు. జూన్ 4న ఉదయం 8 గంటలకు పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు కౌంటింగ్ ప్రారంభమవుతుందని, అనంతరం ఈవిఎం యంత్రాల ఓటింగ్ లెక్కింపు ప్రారంభించాలని అన్నారు. ఎన్నికల కమీషన్ నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ సకాలంలో కౌంటింగ్ ప్రక్రియ ముగిసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో సజావుగా కౌంటింగ్ నిర్వహించే విధంగా కౌంటింగ్ కేంద్రాల వద్ద అవసరమైన ఏర్పాట్లు చేయాలని, కౌంటింగ్ సిబ్బంది, కౌంటింగ్ ఏజెంట్లకు సరిపడ త్రాగునీరు, భోజనం వసతి కల్పించాలని అన్నారు. ఈ సమావేశంలో సహయ రిటర్నింగ్ అధికారులు బి.గంగయ్య, హనుమా నాయక్, ఎన్నికల డిప్యూటీ తహసిల్దార్ ప్రవీణ్, అధికారులు పాల్గొన్నారు.

## విద్యా సంవత్సరం ప్రారంభానికి పాఠశాలలు సిద్ధం చేయాలి



### జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్

ప్రజాపక్షం/ మంచిర్యాల ప్రతినిధి : 2024/25 విద్యా సంవత్సరం ప్రారంభంలోగా అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి, మరమ్మత్తు పనులు వేగవంతం చేసి పాఠశాలలను సిద్ధం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) బి. రాహుల్ అన్నారు. మంగళవారం మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ ప్రాంతంలోని ప్రభుత్వ పాఠశాలలలో కొనసాగుతున్న అభివృద్ధి, మరమ్మత్తు పనులను మంచిర్యాల మున్సిపల్ కమీషనర్ మారుతి ప్రసాద్ కలిసి అకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ అధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులను వచ్చే విద్యా సంవత్సరం పాఠశాలల ప్రారంభంలోగా పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని తెలిపారు. ప్రతి పాఠశాలలో త్రాగునీరు, మూత్రశాలలు, విద్యుద్దీకరణ పనులతో పాటు తరగతి గదుల మరమ్మత్తులు, బాలికల కొరకు ప్రత్యేక మూత్రశాలల పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఏకరూప దుస్తుల కుట్టు కేంద్రాన్ని సందర్శించి దుస్తుల తయారీ పురోగతిని పరిశీలించారు. తరగతులు ప్రారంభం అయ్యేలోగా విద్యార్థులకు ఏకరూప దుస్తులు అందించే విధంగా కృషి చేయాలని, ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు అందించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. మున్సిపల్ పరిధిలో అన్ని వార్డులు శుభ్రంగా ఉండేలా పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని, రోడ్డుపై చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని, ఉల్లఘించిన వారికి నిబంధనల మేరకు జరిమానా విధించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కాలువల పూడిక తీశారు.. చెత్తను రోడ్డుపై వేశారు

ప్రజాపక్షం/జైపూర్ : జైపూర్ మండలంలోని జైపూర్ గ్రామపంచాయతీ పరిధిలో గల ఎస్‌సి కాలనీలో గ్రామ పంచాయితీ సిబ్బంది గత 15 రోజుల క్రితం మురుగు నీటి కాలువలను శుభ్రం చేస్తూ ఆ కాలువలలో ఉన్నటు వంటి చెత్తాచెదారాన్ని, ప్లాస్టిక్ వ్యర్థాలను రోడ్డు మీద వేశారు. కాలువలను శుభ్రం చేసి 15 రోజులు గడుస్తున్న ఆ చెత్తను మాత్రం అక్కడి నుండి తొలగించడం లేదు. గ్రామాల్లోని కాలువలను శుభ్రం చేసిన చెత్తను గ్రామ పంచాయతీ కార్మికులతో సేకరించి ఒక ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డ్‌కు తరలించవలసి ఉంటుంది. కానీ ఇక్కడ అలాంటివి ఏమి పట్టవు అన్నట్లు సంబంధిత అధికారులు, సిబ్బంది వ్యవహరించడంతో గ్రామంలోని ఎస్‌సి కాలనీలు చెత్తతో దర్శనమిస్తున్నాయి. ఇండ్ల నుండి చెత్తను సేకరించే సమయంలో తడి చెత్తను పొడి చెత్తను వేరువేరుగా సేకరించి డంపింగ్ యార్డ్ కు తరలించి అక్కడ ఎరువులను తయారు చేసి దానిని తక్కువ ధర కి రైతులకు అమ్మకం చేయాలని ప్రభుత్వం నిర్ణయించి వేల రూపాయలు ఖర్చుపెట్టి డంపింగ్ యార్డుల వద్ద కంపోస్ట్ షెడ్లను నిర్మాణం చేసింది. కానీ జైపూర్ మండలంలో ఏ ఒక్క గ్రామ పంచాయతీలో కూడా కంపోస్ట్ ఎరువులను తయారు చేసేందుకు సంబంధిత అధికారులు, సిబ్బంది తగు చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఇప్పటికైన సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మీద ఉన్న చెత్తను సేకరించి డంపింగ్‌యార్డ్‌కు తరలించాలని ప్రజలు వేడుకుంటున్నారు.

## ఉత్తమ పురస్కారాలందుకున్న తండ్రి, కూతురు

ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : హైదరాబాద్ మెగా ఎంటర్ప్రైజెస్ వారు ఉగాది నంది, ఐకాస్ పురస్కారలందించారు. హైదరాబాద్ బిర్లా అడిటోరియంలో జరిగిన ప్రతిష్టాత్మక కార్యక్రమంలో నిర్మల్ ప్రముక వైద్యులు డా. వేణుగోపాలకృష్ణ ఉత్తమ నటునిగా ప్రేమతో నాన్న, మహారాజు, ఆవేదన లఘు చిత్రాలకు న ఉగాది నంది పురస్కారమందు కున్నారు. ఆయన కూతురు సుహాసిని ॥ప్రేమతో నాన్న॥ కు ఉత్తమ నటిగా ఐకాస్ అవార్డు అందుకున్నారు.ఇదివరకే డా. వేణుగోపాలకృష్ణ ఎన్నో సార్లు ఉత్తమ వైద్యుని గా జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి ఉత్తమ పురస్మారలందుకున్నారు. రెండు రాష్ట్రాల స్థాయి నంది పురస్కారాల్లో ఉత్తమ దర్శకుడు, నటుడుగా డా వేణుగోపాల కృష్ణ, ఉ త్తమ నటిగా సుహాసిని అవార్డు లందుకుని అందరి ప్రశంసలు పొందారు. సుహాసినీ, వేణుగోపాలకృష్ణలు ఇద్దరూ తండ్రి కూతురు అలాగే ఇద్దరు వైద్య విద్యలో వుండడం విశేషం. సుహాసినీ వేణుగోపాల కృష్ణని శైలజా రెడ్డితో పాటు పలువురు సినీ, టివీ కళకారులు ప్రముఖ వ్యాపార వేత్తలు ఘనంగా సన్మానించి అభినందించారు.

## నకిలీ విత్తనాల నియంత్రణకు టాస్క్ ఫోర్స్ బృందం ఏర్పాటు

ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : జిల్లాలో నకిలీ విత్తనాలు నియంత్రణకు జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ బృందం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఆది రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నకిలీ విత్తనాల నియంత్రణ కోసం సహాయ వ్యవసాయ సంచాలకులు పెద్దపల్లి విత్తన ధ్రువీకరణ అధికారి మంథని పోలీసు అధికారులతో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేశామని, వీరు 24 గంటల పాటు అందుబాటులో ఉంటారని, రైతులు ఎవరైనా బిజి3, హెచ్.టి ప్రతి విత్తనాలు రాత్రి వేళల్లో గ్రామాల్లో తిరిగి అమ్మే విత్తనాలు గురించి సమాచారం తెలిస్తే టాస్క్ ఫోర్స్ అధికారులుపెద్దపల్లి సహాయ వ్యవసాయ సంచాలకులు యం శ్రీనాథ్ 7288894148, కరీంనగర్ విత్తన ధ్రువీకరణ అధికారి యం కిషోర్ కుమార్ 7288879669, మంథని అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ పి. మల్లయ్య 9440461918 ఫోన్ నెంబర్ లకు సమాచారం అందించాలని, అధికారులకు సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడును, నకిలీ విత్తనాలు అరికట్టడంలో ఎవరైనా తమకు తెలిసిన సమాచారం ఉంటే అందించి రైతు సంక్షేమానికి తోడ్పడగలరని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## భూ సేకరణ ప్రక్రియపై ప్రత్యేక దృష్టి

### అదనపు కలెక్టర్ జి.వి.శ్యామ్ ప్రసాద్ లాల్

ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : సింగరేణి క్రింద చేపట్టాల్సిన భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయడంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అదనపు కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని తన చాంబర్ లో పెండింగ్ భూ సేకరణ పై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ శ్యామ్ ప్రసాద్ లాల్ మాట్లాడుతూ, రామగిరి మండలంలోని సుందిళ్ల ముస్త్యాలల గ్రామాలలో సింగరేణి పరిధి క్రింద గతంలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియ ఎంజాయ్మెంట్ సర్వే చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. భూ సేకరణ ప్రక్రియ పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అదనపు కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సమీక్షా సమావేశంలో సింగరేణి ఆర్.జే.ఎం, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.